ప్రమాదం.. ఇలా పసిగట్టొచ్చు



- వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం
- పలు యాప్‌లను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం
- అప్రమత్తతతోనే సంపూర్ణ రక్షణ

6


## ఉన్నత లక్ష్యం దిశగా కృషి చేయాలి

- కస్తూర్బా పాఠశాలను సందర్శించిన కలెక్టర్



కస్తూర్బా విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అనుభవజ్ఞులైన బోధన సిబ్బందిని నియమించి నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల దిశగా పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. విద్యాలయంలోని తరగతి గదులు, వంటశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, వివిధ అంశాలపై విద్యార్థులను కలెక్టర్ కుమార్ దీపక్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో మంచినీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు, సదుపాయాలను కల్పించిందన్నారు. మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్డీవోకు అదనపు కలెక్టర్ బాధ్యతల అప్పగింత



శ్రీనివాసరావు

మంచిర్యాల, జూలై15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఆర్డీవో గూడూరు శ్రీనివాస రావుకు జిల్లా అదనపు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు మంచిర్యాల ఆర్డీవోగా గత అక్టోబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన సబావత్ మోతీలాల్ మే 30న ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉండగా ఆర్డీవోకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# స్థానిక ఎన్నికలపై బీసీల గురి..!



- జనాభా దామాషా ప్రకారం పెరగనున్న కోటా
- గతంలో 22 శాతం రిజర్వేషన్..
- ఈసారి 42 శాతం పెంపునకు ప్రభుత్వం ఆర్డినెన్స్
- గత ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీల హవా
- పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో వారిదే పై చేయి

మంచిర్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేపట్టడంతో వెనుకబడ్డ కులస్థుల (బీసీ) జనాభాపై క్లారిటీ వచ్చింది. మొత్తం రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీ జనాభా ఉన్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. దీంతో స్థానిక ఎన్నికలపై ఆ కులాలకు చెందిన ఆశావహులు గురిపెడుతు న్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం బీసీలకు సముచిత స్థానాన్ని కల్పించేందుకు సన్నాహాలు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి వేదికగా బీసీలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కసరత్తు చేస్తోంది. అదే సమయంలో తమకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ బీసీ సంఘాలు కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బీసీలు సత్తా చాటిన విషయమై ప్రస్తుతం విస్తృత చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో బీసీలకు 22 శాతమే రిజర్వేషన్ కల్పించగా అప్పటి ఎన్నికల్లో బీసీ కులస్థులు తమ ప్రభావాన్ని చాటారు. ఈ సారి ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లను ఆర్డినెన్స్ మా ర్గంలో అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో బీసీల ప్రాతినిధ్యం మరింతగా పెరుగుతుందన్న అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### గత ఎన్నికల్లో పెరిగిన బీసీల ప్రాతినిధ్యం...

2019 పంచాయతీ ఎన్నికల్లో బీసీలు తమ ప్రాతినిధ్యాన్ని పెంచుకున్నారు. అప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం కేవలం 22శాతమే రిజర్వేన్లు కల్పించినప్పటికీ జనరల్ స్థానాల్లోనూ పోటీచేసి బీసీలు సత్తాచారు. 2019లో జిల్లాలో 311గ్రామపంచాయతీలకు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. వీటిలో బీసీ రిజర్వుడ్ పంచాయతీలు 49ఉన్నాయి. అవి పోను జనరల్ స్థానాల్లోనూ బీసీలు 83 స్థానాల్లో గెలిచారు. కాగా ఆ ఎన్నికల్లో మొత్తం 132 పంచాయతీలను బీసీలు గెలిచి సత్తా చాటారు.

అలాగే జిల్లాలోని 130 ఎంపీటీసీ స్థా నాలకు గాను 13 స్థానాలు బీసీలకు రిజర్వ్ అయ్యాయి. వాటికి అదనంగా జనరల్ స్థానాల్లోనూ 38సీట్లను బీసీ లు గెలుచుకున్నారు. మొత్తంగా ఎంపీటీసీ స్థానాల్లో 51 సీట్లు గెలిచిన బీసీలు తమ ఆధిపత్యం కొనసాగించారు. అలాగే జిల్లాలో 16జడ్పీటీసీ స్థానాలకు గాను బీసీ రిజర్వేషన్ స్థానాలు రెండు ఉన్నాయి. ఇవి పోను జనరల్ స్థానాల్లో నాలుగింటిని బీసీలు గెలచుకోగా మొత్తంగా ఆరుగురు బీసీలు జడ్పీటీసీలుగా ఎంపికయ్యారు. కేవలం 22శాతం రిజర్వేషన్‌తోనే గత ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు, ఈసారి దాదాపు రెట్టింపు స్థానాలు రిజర్వ్ అయ్యే అవకాశం ఉండటంతో... చట్టసభల్లో తమ ప్రాతినిధ్యం మరింతగా పెంచుకోవాలనే కుతూహలంతో ఉన్నారు.

### జనరల్ కోటాలో బీసీల పట్టు...

జిల్లా వ్యాప్తంగా బీసీలు తమ కోటాను మించి గత ఎన్నికల్లో విజయం సాధించగా, రాబోయే ఎన్నికల్లో కూడా అదే ఒరవడి కొనసాగించేదుకు సన్నాహాల్లో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సారి 306 గ్రామ పంచాయతీలు (మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 పంచాయతీలు విలీనం అయ్యాయి) ఉండగా జనరల్ కోటాలోనూ తమ పట్టు బిగించేందుకు బీసీలు ఇప్పటి నుంచే సాధ్యా సాధ్యాలపై కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని జనాభాలో 56 శాతానికిపైగా...


(తరువాయి 7లో)


## రజకుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని సింగాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన రజకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం జీఎం ఎం. శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, మడేలయ్య గుడి కట్టించేందుకు సహకారం అందించాలన్నారు. ఓసీపీ నుంచి మట్టి ఇప్పించాలన్నారు. దోబీఘాట్ స్థలాన్ని పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, జిల్లా కమిటీ సభ్యుడు పాయిరాల శంకర్, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కబ్జా చేసిన స్థలంలో ప్రభుత్వ భూమి అని బోర్డు ..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నస్పూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ శివారులోని సర్వేనంబరు 42లో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన స్థలంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు చదును చేసి కబ్జాకు ప్రయత్నించారు. 'ఐటీ శాఖ స్థలం కబ్జా' చదును చేసిన గుర్తు తెలియని వ్యక్తులు' శీర్షికన ఈనెల 12న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం ఆ స్థలంలో ప్రభుత్వ భూమి ఏవరైనా అక్రమణచేస్తే చర్యలు ఉంటాయని బోర్డును రెవెన్యూ అధికారులు పెట్టించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన భూమి అని, ఏవరైనాకబ్జా చేయాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తహసిల్దార్ సంతోష్ హెచ్చరించారు.

# మావోయిస్టు దంపతుల లొంగుబాటు

- రివార్డు అందజేసిన రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



లొంగిపోయిన మావోయిస్టు దంపతుల వివరాలు వెల్లడిస్తున్న రామగుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్ ఝూ

మంచిర్యాల/పెంచికలపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీసభ్యుడు, టెక్నికల్ టీమ్ ఇన్‌చార్జి ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న(70), అతడిభార్య చౌదరి అంకూబాయి అలియాస్ అనితక్క (55) మంగళ వారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ ఎదుట లొంగి పోయారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న ప్రస్తుతం దండకారణ్యంలో పనిచేస్తున్నారు. 1983లో చెన్నూరు దళంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన లచ్చన్న సిర్పూర్ దళంలో డిప్యూటీ కమాండర్‌గా పనిచేశాడు. 2002లో దండకారణ్యంలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి దండకారణ్యంలో నార్త్‌బస్తర్ డివిజన్ కమిటీకి టెక్నికల్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. ఆయుధాల తయారీలో సిద్ధహస్తుడిగా పేరుంది. ఆయనభార్య చౌదరి అంకూబాయి కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలం అగరగూడ గ్రామానికి చెందినవారు. 1988లో పీపుల్స్ వార్‌లో చేరిన ఆమె సిర్పూర్‌దళంలో పని చేస్తూ ఆత్రం లచ్చన్నను పెళ్లిచేసుకుంది. ఇద్దరూ దండకారణ్యంలో టెక్నికల్‌విభాగంలో పనిచేశారు. పార్టీకి ఆదరణలేక పోవడం, అనారో గ్యంతో లొంగిపోతున్నట్లు మావోయిస్టు దంపతులు లచ్చన్న, అంకూబాయిలు పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ(రాష్ట్ర కమిటీ) సభ్యుడు ఆత్రం లచ్చన్నకు రూ.20లక్షలు, అతని భార్య నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యురాలు చౌదరి అంకుబాయికి రూ.5లక్షల రివార్డులను సీపీ అంబర్ కిశోర్‌ఝూ అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మావోయిస్టులకు ప్రజల్లో ఆదరణ లేదని, అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని, వారికి తెలంగాణ ప్రభుత్వ పరంగా పునరావాస పథకాలు, ఇతర సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఏసీపీ మల్లా రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణకు 2.7 లక్షల టన్నులు ఎరువులు అందజేయాలి

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ఎరువుల సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని , వెంటనే 2.7 లక్షల టన్నుల ఎరువులను అందజేయాలని కోరుతూ డిల్లీలో మంగళవారం కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రజత్‌మిశ్రాకు పెద్దపల్లి ఎంపీగడ్డం వంశీకృష్ణ వినతి పత్రం అందించారు. ఫెర్టిలైజర్ కార్పొరేషన్ అనుకున్న లక్ష్యాలను చేరుకోకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు ఎరువుల కొరత ఉండడం ఆవేదనకు గురి చేస్తుందని, ఎరువులను వెంటనే సరఫరా చేయాలని కోరారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ సామర్థ్యం పెంపుదల చేపట్టాలన్నారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలే తన లక్ష్యమన్నారు. దీనిపై ఎరువుల పంపిణీకి కార్యదర్శి హామీ ఇచ్చినట్లు ఎంపీ పేర్కొన్నారు.



కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ వంశీకృష్ణ

## వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి




బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

### డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కీటక జనిత వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా,డెంగ్యూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యాధికారులు వీటిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం హమాలీవాడలోని బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అందిస్తున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత దవాఖానా పరిధిలో ఉన్న ప్రజలకు రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి రోగాలు ఉంటే చికిత్స అందించాలన్నారు. టీ హబ్ ద్వారా రిపోర్టులను వేగంగా తెప్పించుకుని మందులను పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, నర్సింగ్ ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు పెరగకుండా నియంత్రించాలన్నారు. పిల్లలకు టీకాలను సకాలంలో ఇప్పించాలని సూచించారు. బస్తీ దవాఖానాలో ఆర్‌డీ కిట్ల ద్వారా పరీక్షలు చేయాలని, ఎప్పటికప్పుడు వాటి వివరాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి రమ్య, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన ఆదివాసీలు



తహసీల్దార్ రోహిత్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆదివాసి సేన నాయకులు

దండేపల్లి జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసి మహిళలు అని కూడా చూడకుండా రాత్రి సమయంలో బైండోవర్ చేయడానికి ప్రయత్నించిన అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ రోహిత్ దేశపాండేకు సంఘం నాయకులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పిం చారు. ఆయన మాట్లాడుతూ చెట్ల పొదలు తొలగించారనే కారణంతో ఇటీవల కొందరు మహిళలపై కేసు నమోదు చేశారన్నారు. సోమవారం రాత్రి ఆదివాసీ మహిళలను అటవీ శాఖ అధికారులు వాహనంలో ఎక్కించుకుని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకవచ్చి ఇబ్బందులకు గురి చేశారన్నారు. దీనిని ఆదివాసి సేన తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని, అటవీ శాఖ అధికారులు వెంటనే గిరిజన మహిళలకు బేషరత్తుగా క్షేమాపణ చేప్పాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జంగు, జలపతి, ఆదిరావు, భుజారంగరావు, భీంరావు, లింగారావు, దీపారావు, గంగు, రాజేష్, నారాయణ, కిషన్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నిరసన

నస్పూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సిగాచి ప్రమాద మృతులకు సరైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయం ఏవో కు అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సిగాచి ప్రమాద మృతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, నాయకులు రమేష్, భాగ్య, పోచక్క, తదితరులు పాల్గొన్నారు.

## చల్లంగా చూడు ఎల్లమ్మ తల్లి

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

దండేపల్లి జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం సందర్భంగా ఊరు. వాడా, పిల్లపాపలను చల్లగా చూడాలని, పాడి పంటలు బాగా పండేలా దీవించాలని చల్లంగా చూడాలని అంటూ ఎల్లమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక నైవేద్యంతో పూజలు నిర్వహించారు. మంగళవారం దండేపల్లి మండలం నర్సాపూర్, నాగసముద్రం, రెబ్బనపల్లి, వెల్గనూర్ తదితర గ్రామాల్లోని శ్రీ రేణుకఎల్లమ్మ తల్లి ఆలయంలో కుటుంబసమేతంగా తరలివచ్చి ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ యేట ఖరీఫ్‌సీజన్ ప్రారంభంలో ఆషాడమాసంలో గ్రామదేవతలకు ప్రత్యేకపూజలు చేయడం ఆనవాయితీ వస్తుంది. పూజల అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా ఆలయంవద్ద, లేద తమతమ ఇళ్లవద్ద సామూహిక విందులను అరగిస్తారు. దీంతో ఏ గ్రామంలో చూచిన ఆలయం వద్ద భక్తులతో సందడి నెలకొంటుంది.

## చైతన్యం చేసే ప్రదర్శనలు అవసరం

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను చైతన్యం చేసే కళా ప్రదర్శనలు అవసరమని రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడు అంతడుపుల నాగరాజు పేర్కొ న్నారు. మంగళవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ప్రజా సంఘాలు, ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆయనను ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కళాకారుడిగా ప్రజల్లో చైతన్యం కోసం పని చేశానని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకువెళ్లడానికి ధూంధాంను స్థాపించానన్నారు. తెలంగాణ ప్రభుత్వం తనను గుర్తించి పదవీ ఇవ్వడం సంతోషంగా ఉందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానన్నారు. తాను పుట్టి పెరిగిన మందమర్రిని ఎన్నడు మర్చిపోనని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు.

మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో నిర్మిస్తున్న ఇందిరా మహిళ భవన్ నిర్మాణ పనులను సందర్శించారు. త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా క్యాంటీన్ల ఏర్పా ట్లు, పెరటి కోళ్ల పెంపకం, డైరీఫాం ఇతర వ్యాపార అవకాశాలు కల్పిం చడంతో పాటు పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుందన్నారు. ఇందిరా మహిళ భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం నస్పూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల పరిసరాలను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

# నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

- ఏసీపీ ప్రకాశ్



సీసీసీ కార్నర్ వద్ద వాహనాల తనిఖీలో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం, జూలై15 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుం టామని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద స్పెషల్ డ్రైవర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్‌లేని వాహనాలను టాంపరింగ్‌కు పాల్పడిన వాహనదారులను గుర్తించి అక్కడే నెంబర్ ప్లేట్లను బిగించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ చలాన్లకోసం కొందరు నెంబర్లు పేట్లు తీస్తున్నారని నాలుగు నెంబర్లకు బదులు కొన్ని నెంబర్లపై స్టిక్కర్లువేస్తూ టాంపరింగ్‌కు పాల్పడుతున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్, గంజాయి సేవించడం వంటి వారిపై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశామన్నారు. స్పెషల్ పోలీసుల ద్వారా నిరంతరం తనిఖీలు చేపడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తామన్నారు. మంచిర్యాల సీఐ ప్రమోద్ రావు, ఎస్ఐ మజారుద్దీన్, స్పషల్ బ్రాంచి పోలీసులు పాల్గొన్నారు.

### నస్పూర్‌లో 25 ద్విచక్ర వాహనాల సీజ్

నస్పూర్ : నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్లు లేకుండా రోడ్లపై తిరుగుతున్న ద్విచక్రవాహనాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సీసీసీకార్నర్ వద్ద మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నంబరు లేని 25వాహనాలను సీజ్ చేశారు. వాహనాదారులకు, మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ వాహనాలకు నంబరు ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరగవద్దని, అది నేరమన్నారు. రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవన్నారు. తనిఖీలో రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై ఉపేందర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఖలీం

మంచిర్యాలక్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డుకు చెందిన ఆటోడ్రైవర్ ఖలీం మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఖలీం శెట్టిపెల్లి శ్రీనివాస్ అనే ఆటోడ్రైవర్ వద్ద ఐదు నెలల క్రితం రూ. 50వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలని శ్రీనివాస్ అడగడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని మరో నెలలో చెల్లిస్తానని తెలిపాడు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ షఫీ డబ్బులు వెంటనే చెల్లించాలని ఖలీంపై ఒత్తిడి తెచ్చాడు. అంతేగాకుండా ఆటో యూనియన్ గ్రూపులో సోషల్ మీడియాలో అప్పు చెల్లించాలని మెసేజ్ పెట్టాడు. రాత్రి సమయంలో ఖలీం ఇంట్లో లేనప్పటికీ ఆయన భార్య, కూతురితో అసభ్యంగా మాట్లాడుతూ డబ్బులు ఇవ్వని పక్షంలో చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఖలీం పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి దగ్గర ఆటో డ్రైవర్లు చూస్తుండగానే తన వద్ద ఉన్న ఆలౌట్ తాగాడు. వెంటనే తోటి డ్రైవర్లు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఖలీం కుమారుడు సోహేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య

సిర్పూర్(టి), జూలై 15 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం లింబుగూడ గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి సుర్పం శేఖర్(17) మంగళవారం తమ చేనులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శేఖర్ ఆసిఫాబాద్ పట్టణంలోని పీటీజీ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరాడు. కొన్ని రోజులు తరగతులకు హాజరయ్యాడు. నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చారు. తాను చదువుకోనని, కళాశాలకు వెళ్లనని తల్లిదండ్రులకు చెప్పుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం లింబుగూడలోని వారి చేనులోని వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి సుర్పం యాదవ్ చేనుకు వెళ్లగా కుమారుడు శేఖర్ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దొంగలను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

శ్రీరాంపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే 5 గనిలో దొంగతనం చేసేందుకు దొంగలు విఫ్లప్రయత్నం చేయగా, సెక్యూరిటీ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. సోమవారం రెండవ షిఫ్ట్‌లో దొంగలు కేబుల్ అపహరించడానికి ప్రయత్నించారు. అప్రమత్తమైన ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ప్రతిఘటించగా, వారిపై దొంగలు రాళ్ల వర్షం కురిపించారు. దీంతో ఇద్దరు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారు. వెంటనే జమేదార్, ఏసీటీసీ, ఎంటీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకున్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి దొంగలను ఒకవైపు వెళ్లేలా పరిగెత్తించారు. దీంతో ముగ్గురు పట్టుబడగా, ఇద్దరు దొంగలు పారిపోయారు. దొరికిన ముగ్గురు దొంగలను పోలీసులకు అప్పగించారు. స్క్రాప్, రాగి తీగ దొంగతనానికి గురికాకుండా కాపాడిన సెక్యూరిటీ సిబ్బందిని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి అభినందించారు.

## గుడుంబా స్థావరాలపై దాడి

తిర్యాణి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్కపల్లి శివారులో గుడుంబా స్థావరాలపై మంగళవారం ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, గుడుంబా తయారీకి ఉపయోగించే 800 లీటర్ల బెల్లం ద్రావణం ధ్వంసం చేశారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## నేరాలు జరగకుండా చూడాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు జరగకుండా చూడాలని జిల్లా జడ్జి, జిల్లా డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఎంవీ రమేశ్ అన్నారు. కోర్టు ఆవరణలో యూటీఆర్‌సీ కమిటీ సమావేశంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీల ఆరోగ్య పరిస్థితులు, సౌకర్యాలు, వారు చేసిన నేరాలపై చర్చించారు. దీంతో పాటు చిన్న చిన్న నేరాలపై బెయిల్ మంజూరు గురించి కూడా కమిటీ సభ్యులతో చర్చించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, డీఎస్పీ రామానుజం, సబ్ జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం ఇలా.. పసిగట్టొచ్చు




- వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం
- పలు యాప్‌లను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం
- అప్రమత్తతతోనే సంపూర్ణ రక్షణ

కౌటాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగానే పసిగట్టే వీలుంది. పిడుగు, వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రమాదాలను ముందే తెలుసుకోవచ్చు. పిడుగు ఎప్పుడు, ఎక్కడ పడుతుందో తెలియక ప్రజలు, మూగ జీవాలు మృత్యువాత పడుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగా తెలుసుకొనేందుకు దామినీ మేఘదూత్, రెయిన్ అలారం లాంటి యాప్‌లను కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లతో ముందస్తుగా అప్రమత్తమై ప్రమాదం నుంచి పూర్తి రక్షణ పొందవచ్చు. ఈ యాప్‌లపై అవగాహన లేని ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోక పోవడంతో ఏటా పదుల సంఖ్యలో ప్రజలు మూగజీవాల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి.

### దామినీ యాప్..

పిడుగు ఎప్పుడు, ఎక్కడ పడుతుందో ముందస్తుగా పసిగట్టడం దామినీ యాప్ లక్షణం. సాధారణంగా వర్షాకాలంతో పాటు ఏప్రిల్, మే నెలల్లో పిడుగులు పడడం సహజం. వ్యవసాయ పనుల హడావుడిలో ఉండే రైతులు పిడుగు పడే సమయంలో దగ్గరలోని ఎత్తయిన చెట్ల కిందికో, ఇతర ప్రదేశాలకు వెళ్తుంటారు. అవి అంత సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులను అప్రమత్తం చేసేదే దామని యాప్. దీనిని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇది సమీపంలోని 20 కిలో మీటర్ల దూరంలో 5 నుంచి 20 నిమిషాల్లో ఎక్కడ పిడుగు పడుతుందో అప్రమత్తం చేస్తుంది. దీని వల్ల ప్రమాదం ముందస్తుగా పసిగట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చు.

### రెయిన్ అలారం..

చుట్టూ 20 కిలో మీటర్ల దూరంలో ఎప్పుడు, ఎక్కడ వర్షం పడుతుందో ముందస్తుగా తెలుసుకునేందుకు రెయిన్ అలారం యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లో రేయిన్ అలారం అని ఇంగ్లీష్‌లో టైప్ చేస్తే ఈ యాప్ కనిపిస్తుంది. కేవలం ఒక నిమిషంలో డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు అందించిన వివరాల మేరకు అతను ఉన్న ప్రాంతానికి సమీపంలో 20 కిలో మీటర్ల దూరంలోనే ఎక్కడ వర్షం పడే సూచనలు ఉన్నాయో సమగ్ర సమాచారం క్షణాల్లో అందిస్తుంది. దీంతో వర్షం ముప్పు నుంచి ముందే జాగ్రత్త పడే అవకాశం ఉంటుంది.

### జాగ్రత్తలు ఇలా..

- ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- ఎత్తగా ఉన్న ప్రదేశాలు, చెట్ల కింద ఉండకూడదు.
- విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి.
- ల్యాండ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదు.
- విద్యుత్ సరఫరా అయ్యే ఇనుము, రాగి, ఇత్తడి, అల్యూమినియం లాంటి వస్తువులను తాకరాదు.
- వర్షంలో వంట సామగ్రి, బోళ్లు కడగవద్దు.
- ఇంట్లో నుంచి బయటకు వెళ్లరాదు.

ఇలా తగు జాగ్రత్తలు తీసుకుంటే పిడుగు పాటు నుంచి రక్షణ పొందవచ్చని చెబుతున్నారు.

### మేఘదూత్ యాప్..



ఈదురు గాలులు, వాతావరణ సమతుల్యతను ముందస్తుగా పసిగట్టి సమగ్ర సమాచారం అందించేందుకు మేఘదూత్ యాప్ ఉపయోగ పడుతుంది. పంట చేలకు ఎరువులు అందించాల్సిన సమయంలో లేదా వరి కోతల సందర్భంగా రైతులకు నష్టం చేసేవి వర్షాలే. దీనిని తప్పించేందుకు భారత వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌నకు రూపకల్పన చేసింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే తాజా సమా చారం తెలిసోతుంది. రాబోయే ఐదు రోజుల్లో వాతావర ణ మార్పులు, వర్ష సూచనలు సహా ఆకాశం మేఘావృతం అవుతుందా, లేదా, గాలులు ఏ మేరకు ఎక్కడి నుంచి ఎక్కడికి ఏ దిశగా వీస్తాయో తెలుసుకోవచ్చు.

## కేజీబీవీలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిర్యాణి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మాణిక్యాపూర్ కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కుక్ పోస్టు ఒకటి, స్కావెంజర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, వీరు స్థానిక మహిళలై ఉండాలని తెలిపారు. ఆసక్తి గలవారు 19వ తేదీ లోగా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

బెజ్జూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో సునీత అన్నారు. మండలంలోని సోమిని ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులంతా సమయ పాలనపాటిస్తూ మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సోమిని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను మెరుగైన బోధన అందించాలని సూచించారు. ఆమె వెంట హెచ్ఎం భిక్షమయ్య, ప్రత్యూష, మాజీ ఎంపీసీటీలు సాయి, శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న కేంద్రమంత్రి హర్ష మల్హోత్రా, పాల్గొన్న అధికారులు, ఎమ్మెల్యేలు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయమంత్రి హర్ష మల్హోత్రా అన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ నిధులు రూ. కోటి యాభై లక్షలతో నిర్మించిన కేంద్ర గ్రంథాలయాన్ని, ఎంపీడీవో కార్యాలయ అవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని, మండలంలోని తుంపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ కింద నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. నిర్ణీత సమయంలో పథకాలు లబ్ధిదారులకు చేరే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో అమలు చేసేందుకు, అర్హులకు లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 117 అస్పిరేషనల్ జిల్లాలను గుర్తించిందని చెప్పారు. ఆసిఫాబాద్ జిల్లా కూడా అందులో ఎంపికైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకల్పం ప్రకారం ప్రతి అస్పిరేషనల్ జిల్లాలో నీతి ఆయోగ్ ద్వారా గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో సమీక్షించేందుకు కేంద్ర మంత్రులు పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారని అన్నారు. అంతకు ముందు గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సంక్షేమ పథకాల పని తీరుపై లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఏఎస్పీ చిత్తరంజన్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్ల, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### వినతుల వెల్లువ..

జిల్లాలో కన్జర్వేషన్ రిజర్వ్ టైగర్ కారిడార్ ఏర్పాటు కోసం తీసుకు వచ్చిన జీవో 49ని రద్దు చేయాలని, జిల్లాలో అటవీశాఖ అనుమతులు లేకుండా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వాటికి అనుమతులు ఇప్పించాలని వినతిపత్రాలు అందజేశారు. అస్పిరేషన్ ప్రాంతమైన తిర్యాణి మండలంలో వంతెనలు, కల్వర్టులు, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కేంద్ర మంత్రికి విన్నవించారు. కరోనా సమయం నుంచి జర్నలిస్టులకు నిలిపివేసిన 50 శాతం రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధించాలని, టోల్‌టాక్స్‌లో మినహాయింపు ఇవ్వాలని జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఫారెస్టును ఏర్పాటును విరమించుకోవాలని జీవో 49 రద్దు చేయాలని సీపీఎం నాయకులు దినకర్, శ్రీనివాస్, రాజేందర్, మాలశ్రీ, కార్తీక్ వినతపత్రం అందజేశారు.

## అధికారుల నిలదీత


పోడు రైతులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

చింతలమానేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి రేంజ్ అటవీ పరిధిలో దిందా అటవీ ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించిన అటవీశాఖ అధికారులను మంగళవారం గ్రామస్థులు నిలదీశారు. తాము కొన్నేళ్ల నుంచి సాగు చేసిన భూముల్లో ఇప్పుడు మొక్కలు నాటితే తమ జీవనం ఎలాగని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికారులు రైతులకు నచ్చ చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. గతంలో సైతం పోడు భూముల కోసం ఇక్కడి రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

## బుద్ధుడి బోధనలు అనుసరించాలి

వాంకిడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడి బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్కర్ అశోక్ అన్నారు. బుద్ధ అండ్ ధమ్మ పుస్తక పఠన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక జైత్వాన్ బుద్ధ విహర్‌లో బుద్ధుడి విగ్రహాన్ని స్థాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, నాయకులు జైరాం, శ్యాంరావు, సందీప్, రోషన్, విఠల్, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం బుదల్‌ఘాట్ బ్రిడ్జి వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. నిందితుల నుంచి రూ.6,800 నగదుతో పాటు నాలుగు ఫోన్లను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, కానిస్టేబుళ్లు దేవేందర్, సంజీవ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవో 49ని రద్దు చేయాలి

ఆసిఫాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలను, ఇతర పేదలను జల్ జంగిల్ జమీన్‌కు దూరం చేసే జీవో 49ని ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మండలంలోని మాన్కపూర్ గ్రామంలో మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జీవో 49 వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీకానంద్, కార్తీక్, చందు, రాము, జైతు, భీము, లచ్చుబాయి తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): త్వరలో చేపట్టే వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వనమహోత్సవంలో ప్రతిపాదించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సిబ్బందిని సమన్వయం చేస్తూ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. సమావేశంలో ఏపీవో చంద్రశేఖర్, ఈసీ శ్రావణ్ పాల్గొన్నారు.

# మారుపేర్ల సమస్య పరిష్కరించాలి


డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ కోరారు. సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రుకు పలు సమస్యలపై మంగళవారం ఆయన ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, మెడికల్ బోర్డు నిర్వహణ లోపాలు సవరించాలని, డిస్మసల్ కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోవాలని, ఇక్కడి ఉద్యోగులను నైనీ బ్లాక్‌కు బదిలీచేసే ప్రక్రియను నిలిపివేసి, ప్రత్యేకంగా నియామక ప్రక్రియ చేపట్టాలని, పెండింగ్ కేసులు పరిష్కరించాలని, మందుల కొరత తీర్చాలని, ప్రస్తుత బదిలీ పాలసీని రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న సర్వే ఆఫీసర్ల పోస్టులు భర్తీ చేయాలని, ఫిట్ ఫర్ సేమ్ డ్యూటీగా ప్రకటించబడి, రెండేళ్లలోపు ఉన్న సర్వీసు ఉన్న వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద మరో అవకాశం కల్పించాలని కోరారు. సంబంధిత విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయా సమస్యలు పరిష్కరిస్తానని డైరెక్టర్ హామీ ఇచ్చారు. జనక్ ప్రసాద్ వెంట కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, జెట్టి శంకర్ రావు, ప్రధాన కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్ ఉన్నారు.

# గైర్హాజరైతే ఉద్యోగం కోల్పోతారు


మాట్లాడుతున్న మందమర్రి జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో తరుచూ గైర్హాజరయ్యే కార్మికులు నాగాల పేరిట ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో గైర్హాజరు కార్మికులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సంస్థలో లేని విధంగా సింగరేణిలో వేతనాలు ఉన్నాయన్నారు. వేతనాలతో పాటు అదనం గా క్వార్టర్, కరెంటు, తాగునీరు తదితర సౌకర్యాలు ఉచితంగా ఉన్నాయని చెప్పారు. సింగరేణిలో ఉద్యోగం రావడం ఎంతో అదృష్టమన్నారు. విధులకు గైర్హాజరయ్యే కార్మికులు ఎంతో బాధపడేవారని, ఇప్పుడు కారుణ్య నియామకాల కింద వచ్చిన వారు గైర్హాజరు కావడం సరైంది కాదన్నారు. గైర్హాజరైతే వేతనాలు నష్టపోతారని, ఈ ప్రభావం ఉత్పత్తిపై పడుతుందన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాసిపేట 1, 2 గనుల్లో కనీసం వంద మస్టర్లు కూడా చేయని వారున్నారని ఇది సరైంది కాదన్నారు. కంపెనీ నిబంధనల ప్రకారం పూర్తి మస్టర్లు ఉంటేనే ఉద్యోగాల్లో ఉంటారని ఇది గమనించి విధులకు గైర్హాజరు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పీఎం శ్యాంసుందర్, డిస్పెన్సరీ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, నాయకులు కంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సింగరేణి వైద్యాధికారి డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. ఆర్కే 7 గనిపై మంగళవారం ఆయన వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వర్షాల తో నీరు నిలవడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు కలిగిస్తాయన్నారు. డెంగీ, మలేరియా వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీటి ట్యాంకులకు మూతలు వేయాలని, చెత్త కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని చెప్పారు. ఒకవేళ నీరు నిల్వ ఉన్నా వాటిని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, రక్షణాధికారి సంతోష్ రావు, పిట్ సెక్రటరీ సారయ్య తదితరులు పాల్గొన్నారు.




## కార్మికులకు గుర్తింపు సంఘం చేసిందేమి లేదు

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికులకు ఒరగబెట్టిందేమి లేదని హెచ్ఎంఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. ఏరియా ఆసుపత్రిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ కార్మికులకు సరిపడ మందులు సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కొత్త గనులు ఎందుకు తీసుకురావడం లేదో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు చెప్పాలన్నారు. కార్మికులను విజిలెన్స్ పేరితో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆకాశ రామన్న ఉత్తరాలకు స్పందించి కార్మికుల ఇంక్రిమెంట్లను కట్‌చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణిలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగితే ఏ అధికారిపై చర్యలు తీసుకోలేదన్నారు. కానీ కార్మికుల ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మెడికల్ బోర్డులో అవినీతి జరుగుతుందని బోర్డును ఆపివేయడం విడ్డూరంగా ఉందని, దీనిపై గుర్తింపు సంఘం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. సోలార్, తదితర ప్లాంట్లలో కాంట్రాక్టు కార్మికులను నియమించడం సరైంది కాదన్నారు. కార్మికులు ఇన్‌కంటాక్స్ పేరుతో తీవ్రంగా నష్టపోతుంటే గుర్తింపు సంఘం పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం, కొత్తగనుల ఏర్పాటు కోసం హెచ్ఎంఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్వతిరాజిరెడ్డి, శ్రీనివాస్, సారయ్య, సుదర్శన్, రాజేష్‌ప్రదీప్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డు కార్మికుల హక్కుల కోసం పోరాటం

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రిటైర్డు కార్మికుల హక్కుల కోసం రిటైర్డు కార్మిక సంఘం పోరాడుతుందని సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్ అన్నారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఏర్పడిన నాటి నుంచి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశామన్నారు. మందమర్రిలో ఇప్పటి వరకు 700 మందికి పెన్షన్ పత్రాలు ఇచ్చారని, ఇందులో పెన్షన్ పెరిగిన వారు కూడా ఉన్నారన్నారు. 11వ వేజ్‌బోర్డు ద్వారా చెల్లించే పెన్షన్, ఏరియర్స్‌ను దరఖాస్తు చేసుకున్న వారు ఉన్నారన్నారు. సింగరేణిలో రిటైర్డు కార్మికులకు మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్నారనికి, వీరికి ఆసుపత్రుల్లో మందులు ఉండేలా యాజమాన్యం చూడాలన్నారు. రిటైర్డు కార్మికులకు ఉచితంగా వైద్యం అందించాలన్నారు. రిటైర్డు కార్మికులకు క్వార్టర్లు కేటాయించాలని, రిటైర్డు కార్మికులకు తమ సంఘం అండగా ఉంటుందన్నారు. సమావేశంలో శంకర్, సంపత్, శంకర్, వీరన్న, రాజన్న, గట్టయ్య, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆడ పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలి

కాసిపేట, జూలై15 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలు ఆటపాటలతో పాటు చదువులోను ముందుండి అన్ని రంగాల్లో రాణించాలని మహిళ సాధికారత సంస్థ హబ్‌జెండర్ స్పెషలిస్టు విజయ అన్నారు. మంగళ వారం కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మహిళ సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైన ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మహిళల కోసం హెల్‌లైన్ ఉన్నాయి, అలాగే స్థానికంగా ఉన్న పోలీసులు కూడా సహకరిస్తారన్నారు. చదువు వల్లనే విజ్ఞానవంతులు అవుతారు. కాబట్టి ప్రతి బాలిక ఉన్నతంగా చదివించాలని కోరారు. ఇందుకు బేటి బచావో బేటి పడావో పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ఆన్‌లైన్ సేఫ్టీ సైబర్ క్రైం, మహిళ హెల్‌లైన్ కోసం 1930, 1098టోల్‌ఫ్రీ నంబర్‌లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కోఆర్డినేటర్ లిఖిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, ఉపాధ్యాయులు రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కూడళ్ల గద్దెలు కూల్చివేత



లక్ష్మీటాకీస్ చౌరస్తాలో గద్దెను కూల్చివేస్తున్న దృశ్యం

మంచిర్యాల, జూలై15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రెండు ప్రధాన కూడళ్లలో ఉన్న జంక్షన్ గద్దెలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. స్థానిక లక్ష్మీటాకీస్ చౌరస్తాతో పాటు వెంకటేశ్వర టాకీస్ కూడలి వద్ద గతంలో నిర్మించిన గద్దెలను గద్దెలు ప్రమాదకరంగా ఉన్నాయనే ఉద్దేశంతో సమూలంగా కూల్చివేశారు. ఆయా కూడళ్ల వద్ద పలు ప్రమాదాలు జరుగడం, గద్దెలు పెద్దగా ఉండడం కారణంగా రహదారులు ఇరుకుగా మారడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. రెండు కూడళ్ల వద్ద ఇటీవల పలు ప్రమాదాలు జరుగగా ద్విచక్రవాహన చోదకులు ప్రాణాలు సైతం కోల్పోయారు. దీంతో కూడళ్ల వద్ద గద్దెలను చిన్నగా నిర్మిస్తారనే ఉద్దేశంతో కూల్చివేసినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కో కూడలిని రూ. కోటి అంచనా వ్యయంతో నిర్మించారు. తద్వారా రెండు కూడళ్ల వద్ద రూ. 2కోట్ల మేర ప్రజాధనం వృథా అయింది.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, జూలై15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీడీపీవోకు సీఐటీయు యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ నేటి వరకు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు రంజిత్, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు అన్యాయం చేయవద్దు

తాండూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జీవో నెంబరు 49 తీసుకువచ్చి ఆదివాసీలకు అన్యాయం చేస్తుందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ నాయకులు పేర్కొన్నారు. జీవో నెంబరు 49ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ జీవో నెంబరు 49 ద్వారా ఆదివాసీలను అడవులకు దూరం చేయడం వల్ల వారి అస్తిత్వం దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు కుర్సెంగ బాపురావు, మండల ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, మాజీ సర్పంచు మణికుమార్ పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

చెన్నూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసగాళ్ల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సీఐ దేవేందర్‌రావు కోరారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణానికి చెందిన రత్న రాజేష్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం సైబర్ మోసగాళ్ల చేతిలో రూ. 50 వేలు పోగొట్టుకున్నారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపామన్నారు. సైబర్ మోసగాడి ఎకౌంట్ నుంచి బాధితుడి ఎకౌంట్‌కు రూ. 16 వేలు ట్రాన్స్‌ఫర్ చేసారన్నారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన సైబర్ వారియర్ జీవన్‌రావును అభినం దించారు.

## గంజాయి కలిగి ఉన్న యువకుడిపై కేసు

నెన్నెల, జులై 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయి కలిగి ఉన్న యువకుడిని మంగళవారం దాడి చేసి పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. జెండావెంకటాపూర్ శివారు మామిడి తోటలో గంజాయి సేవిస్తున్నాడని తమకు సమాచారం వచ్చిందన్నారు. దాడి చేయగా అదే గ్రామానికి చెందిన ఎస్కూరి శశికుమార్ గంజాయి తాగుతూ పట్టుబడ్డారని చెప్పారు. సోదా చేయగా అతడి వద్ద 130 గ్రాముల గంజాయి కవర్ లభించిందన్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా భీమారం మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి రాకేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు శశికుమార్ ఒప్పుకున్నాడని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.



# కల్తీ..కిక్కు

### చెట్లు తక్కువ.. కల్లు ఎక్కువ

### పేదల ఆరోగ్యంతో చెలగాటం

### జిల్లాలో కల్లు వ్యాపారం తీరిది..

మంచిర్యాల క్రైం, జూలై15 (ఆంధ్రజ్యోతి): ఈత, తాటి చెట్ల నుంచి తీసే స్వచ్ఛమైన కల్లుకు బదులుగా కల్తీ కల్లును సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లా కేంద్రంలో చెట్లు తక్కువగా ఉన్నా కల్లు ఎక్కువగా సరఫరా అవుతోంది. చెట్ల నుంచి వచ్చే కల్లు తక్కువగా ఉంటే ఆ కల్లును పదింతలు చేసి సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కిక్ ఎక్కించే మత్తుపదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యంతో చెలగాటుమాడుతున్నారు. కల్తీబారిన పడి అనేక కుటుంబాలు చితికి పోతున్నాయి. లేని రోగాలను కొని తెచ్చుకొని ఆర్థికంగా దెబ్బతింటున్నారు.

మంచిర్యాల మున్సిపాలిటి పరిధిలో ఒక కల్లు డిపోలో పది కౌంటర్లు ఉన్నాయి. దీనిలో టీసీఎస్ పరిధిలో కల్లు దుకాణాలు నాలుగు ఉన్నాయి. మంచిర్యాల రంగపేట, హమాలీవాడలో ఒకటి, నస్పూర్ మండలంలో సంఘ మల్లయ్యపల్లె, శ్రీరాంపూర్ పరిధిలో పోలీసుస్టేషన్ సమీపంలో రెండు లైసెన్స్ లేకున్నా కల్లు దుకాణాలు నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులో కల్లు కంపౌండ్ నిర్వహిస్తున్నారు. దీనికి 30 కిలోమీటర్ల పరిధిలో ఈత, తాటి కల్లును సేకరించి ఆయా కౌంటర్లకు వాహనం ద్వారా సీసాల ద్వారా సరఫరా చేస్తుంటారు. రోజుకు సుమారు వంద పెట్టెల కల్లును విక్రయి స్తున్నారు. ఒక్క రోజు కల్లు ద్వారా 30వేల నుంచి 40వేల వరకు అమ్ముతుంటారు. చుట్టు పక్కల ప్రాంతంలో కల్లు దొరకక పోవడంతో చెట్ల నుంచి తీసు కల్లులో పెద్దమొత్తంలో నీరు, మత్తును ఇచ్చే రసాయనాలు కలుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈత చెట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మినహా మిగితా కల్లు విక్రయాలు జరిగే చాలా ప్రాంతాల్లో ఇదే విధంగా వ్యవహరిస్తున్నారు.

### మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు...

ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో ఎంత కల్లు ఉత్పత్తి అవుతుంది. ఎంత వ్యాపారం జరుగుతుంది. ఎన్ని ఈత, తాటి చెట్లు ఉన్నాయి. అందులో ఎన్ని చెట్ల ద్వారా కల్లును ఉత్పత్తి చేస్తున్నారనే విషయాన్ని అధికారుల వద్ద సంక్షిప్తసమాచారం లేదనే పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### కాటేస్తున్న కల్తీ కల్లు...

తాటి, ఈత చెట్ల నుంచి తీసే స్వచ్ఛమైన కల్లుకు బదులుగా నిషేధిత మత్తు పదార్థాలైన అల్ప్రాజోలం, డైజో ఫాం వంటి నిషేధిత పదార్థాలతో కల్లు తయారు చేసి అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మంచిర్యాల కల్లు కాంపౌండ్లలో అల్ప్రాజోలం 600 నుంచి 700గ్రాముల మందును కలిపి కల్లును తయారు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### నాలుగు రోజుల నుంచి మందు బాబుల్లో మార్పు..



హైదరాబాద్ కూకట్‌పల్లిలో కల్తీకల్లు తాగి 11మంది మృతి చెందడంతో ఎక్సయిజ్ అధికారులు మూడు రోజుల నుంచి ముమ్మర తనిఖీలు చేపట్టారు. దీంతో కల్లు కల్తీ చేయకపోవడం వల్ల తెల్లకల్లుబట్టీల్లో తాగు మం దుబాబులు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. కల్లుబాగా లేదంటూ కౌంటర్‌లో గొడవలకు సైతం దిగుతున్నారు. కల్తీకల్లు తాగిన అలవాటుకు మామూలు కల్లు తాగడం తోనే వారిలో మార్పు వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు.

### కఠినంగా వ్యవహరిస్తాం...

### ఎక్సైజ్ సీఐ గురువయ్య



కల్తీ కల్లు అమ్మకాలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తాం. డబ్బుల కోసం కల్తీ చేసిన నిషేధిత పదార్థాలతో తయారు చేసి అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవు.

### డబ్బు సంపాదనే ధ్యేయంగా...

కొందరు కల్లు వ్యాపారులు నిషేధిత డైజోఫాం, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాలను కలుపుతూ ప్రజలకిక్కు పెంచి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మత్తు పదార్థాలు కలుపడం ప్రమాదకర మని తెలిసిన ధనార్జనే లక్ష్యంగా వ్యాపారులు కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. ఎక్కువగా రైతు కూలీలు, పేదలు రోజంత పడిన కష్టాన్ని మరిచిపోయేందుకు కల్లు తాగుతారు. ఈ రసాయనాలు కలిపిన కల్లు తాగడం వల్ల ఒక్క రోజు తాగక పోయిన వారు పిచ్చిపట్టినట్లుగా వ్యవహరిస్తారు.



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

## సంక్షిప్త సమాచారం

**జన్నారం:** మండలంలోని ధర్మారం ప్రభుత్వ పా ఠశాలకు అదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు జాదవ్ క్రిష్ణవేణి మనోజ్‌ల కూతురు శ్రీకృతి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు ఎల్ఈడీ టీవీని అందజేశారు. కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన గట్టు కవిత మహేశ్‌లు వారి పుత్రుడు గట్టు శ్రేయాన్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా టీవీని అందజేశారు.

●మండలంలోని కామన్‌పల్లి గ్రామానికి చెందిన రమణచారి ఇటీవల రోడ్డు ప్ర మాదంలో గాయాలపాలు కాగా విషయం తెలుసుకున్న తోటి గల్ఫ్‌కార్మికులు 17,800 ఆర్థిక సాయాన్ని కుటుంబానికి అందించారు. గల్ఫ్‌కార్మి కుల సంఘం కామన్‌పల్లి అధ్యక్షులు నరేశ్ ఉన్నారు.

**జైపూర్ :** చలో హైద్రాబాద్ బీసీల మహాధర్నా సభకు వెళ్లకుండా మంగళవారం జైపూర్ ఎస్ఐ శ్రీధర్ బీసీ నాయకులు ఆవిడపు గణేష్, విజ్జగిరి సమ్మయ్యలను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని హైద్రాబాద్ వద్ద మహాధర్నా చేపట్టగా ఈ ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరైంది కాదన్నారు.

**కోటపల్లి :** కోటపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నాగేశ్వర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇదే కార్యాలయం సూపరింటెండెంట్ లక్ష్మయ్య ఇన్‌చార్జీ ఎంపీడీవోగా కొనసాగగా తాజాగా ఆదిలాబాద్ నుంచి నాగేశ్వర్‌రెడ్డి బదిలీపై కోటపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్, ఏపీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగేశ్వర్‌రెడ్డిని సత్కరించారు.

**మంచిర్యాలక్రైం:** మంచిర్యాల కేంద్రంలోని కల్వరి యువశక్తి అనాథ ఆశ్రమంలో 70 ఏళ్ల వృద్ధురాలు మంగళవారం మృతి చెందడంతో ఆమెకు కల్వరి యువ శక్తి యువత మహాప్రస్థానంలో దహన సంస్కారాలు నిర్వహించారు. ముల్కల్ల కుమార్ మాట్లాడుతూ అనాథల ఆశ్రమం కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని కోరారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

●ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

●లక్షెట్టిపేటలో కొత్త రేషన్‌కార్డులు పంపిణీ

లక్షెట్టిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు అవుతుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్‌కార్డులను కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని గత ప్రభుత్వంలో రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో చాలా జాప్యం జరిగిందని కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక్కటిగా ప్రతీ పథకం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తామన్నారు. ఈకార్డుతో ఒక్కొక్కరికి నెలకు 6కిలోల సన్నబియ్యం అందజేస్తామని లబ్ధిదారులు తీసుకోవాలన్నారు.

ప్రతీ సంక్షేమ పథకం నేరుగా అందుతుందని ఎక్కడా ఒక్క పైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి.ఆరీఫ్, మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, ఆర్పీఏ మెంబర్ శ్రీనివాస్, నాయకులు పూర్ణచం దర్‌రావు, చిన్న వెంకటేష్, షాహెద్ అలీ పాల్గొన్నారు.



రేషన్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

## క్రికెట్ అసోసియేషన్‌కు అధికారాలు ఇవ్వాలి

బెల్లంపల్లి, జూలై15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పూర్తిగా అవినీతిలో కూరుకపోవడం వలన తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు అధికార బాధ్యతలు అప్పగించాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి పైడిమల్ల నర్సింగ్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు 170కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు రుజువైందన్నారు. బీసీసీఐ ప్రతి ఏడాది వందకోట్ల రూపాయలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అందజేస్తుందని ఈ నిధులను రాష్ట్రంలో ఏ జిల్లాకు కూడ ఖర్చు చేయడం లేదన్నారు. వెంటనే తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు అధికారం అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు అధికార బాధ్యతలు అప్పజెప్పితే క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి

## రెగ్యులర్ టీపీవోను నియమించాలి

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలిటీలో ఇన్‌చార్జి టీపీవో వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రెగ్యులర్ టీపీవోను నియమించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజలింగుకు బీఎస్పీ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇన్‌చార్జి టీపీవో ఇక్కడ విధులు సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా రెగ్యులర్ టీపీవోను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల శంకర్, మతిన్‌ఖాన్, రహీంబాబా పాల్గొన్నారు.

## పిల్లలతో భోజనం చేసి.. సమస్యలు తెలుసుకొని..

నెన్నెల, జులై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ రవూఫ్‌ఖాన్ మంగళవారం నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని వండుతున్న విధానాన్ని పరిశీలించారు. వంటగది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట చేసేవారు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. పిల్లలతో కలిసి భోజనం చేస్తూ వారితో ముచ్చటించారు. భోజనం బాగుందని ప్రశంసించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్, హెచ్ఎం చంద్రశేఖర్ ఉన్నారు.

## పెండింగ్ నిధులు విడుదల చేయాలి

మందమర్రిరూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రూ. 7200 కోట్లు పెండింగ్‌లో ఉండడం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం వీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు శ్రీకాంత్, రవీందర్, రాజ్‌కుమార్, వినోద్, సిద్ధార్థ, మనోహర్ పాల్గొన్నారు.

## వృత్తి విద్య పరికరాల ప్రదర్శన

కోటపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్‌యూత్ స్కిల్స్ డేను పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్‌లో వృత్తి విద్య పరికరాల ప్రదర్శనను నిర్వహించారు. పాఠశాలలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ అండ్ హార్డ్‌వేర్ విభాగంలో వృత్తి విద్య తరగతులు కొనసాగుతున్నందున వీటికి సంబంధించిన పరికరాలపై ప్రదర్శన చేపట్టారు. ఒకేషనల్ సంజీవ్, ప్రేమ్‌సాగర్‌లు పరికరాల వినియోగం, ప్రయోజనాలు, నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సౌకర్యాలు కల్పించాలి

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడవ జోన్ పాలచెట్టు కేకే 5 బంగ్లాస్ మధ్య ఉన్న డబుల్‌బెడ్ రూంల వారికి సౌకర్యాలు కల్పించాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్ పేర్కొన్నారు. మంగళవారం డబుల్‌బెడ్‌రూం గృహాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు గృహాలు ఇవ్వడం హర్షించదగినదేనని, కానీ చుట్టూ పిచ్చి మొక్కలు ఉండడంతో దోమలు, పాముల సంచారం పెరిగిందన్నారు. ఈ సమస్యలను అధికారులకు విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై బీసీల గురి..!

(5వ పేజీ తరువాయి)

బీసీలు ఉండడంతో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీసీల డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు గట్టి ప్రయత్నమే చేస్తున్నట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి తెలుస్తోంది. ఆర్డినెన్స్ మార్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు మంత్రివర్గం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. మండలం, జిల్లా, రాష్ట్ర యూనిట్లుగా రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు పంచాయ తీరాజ్ చట్టం-2018కి సవరణలు కూడ చేపట్టబోతోంది.

### ఆగస్టులో ఎన్నికల ప్రక్రియ..

ఆర్డినెన్స్ విడుదలకాగానే పంచాయతీరాజ్‌శాఖ రిజ ర్వేషన్లను ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అప్పగించనుంది. ఎన్నికల కమిషన్ ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. కాగా ఓ వైపు రిజర్వేషన్ల ఖరారుపై పంచాయతీరాజ్‌శాఖ కసరత్తు చేస్తుండగా, మరోవైపు ఎన్నికల నిర్వహణకూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పంచాయతీరాజ్‌శాఖ చట్ట సవరణ ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించిన వెంటనే రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తికా గానే గరిష్టంగా 30 రోజుల్లో పరిషత్, సర్పంచ్ ఎన్నికలను పూర్తి చేసేందుకు ఎన్నికల కమిషన్ కరసత్తు చేస్తోంది. ఈ లెక్కన ఆగస్టు చివరి వరకు స్థానిక ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా, ఆశావహులు టికెట్ల కోసం తమ తమ ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నారు.

## చెక్కు అందజేత

చెన్నూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పీఏసీఎస్ సంఘానికి ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు రూ. 3.16 లక్షల ప్రోత్సాహక చెక్కును మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలం గాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు అందజేశారు. చెక్కును సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి అందుకున్నారు. చెన్నూరు పీఏసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరం

చెన్నూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కత్తెరసాల గ్రామంలో అంగ్రాజ్‌పల్లి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 194 మందికి వైద్య పరీక్షలు చేయగా 24 మందికి తెమ పరీక్షలు, 35 మందికి ఎక్స్‌రే తీశారు. ఈ శిబిరంలో వైద్యురాలు నిహారిక, సబ్ యూనిట్ అధికారి జగదీష్, టీబీ సూపర్ వైజర్ అశోక్, సుమలత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## బూత్ లెవల్ అధికారులకు శిక్షణ

జైపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా తయారీపై మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు చెన్నూరు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి చంద్రకళ, తహసీల్దార్ వనజారెడ్డి హాజరయ్యారు. ఓటరు జాబితాను సిద్ధం చేయడంలో పాటించాల్సిన నిబంధనలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఫారం 6, 7, 8ల భర్తీ విధానంపై అవగాహన కల్పించారు. డిప్యూటి తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఆర్ఐ తిరుపతి, అపర్ణ పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

జైపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం మండలంలోని వేలాల గ్రామంలో సంప్రదాయ కప్పతల్లి ఆట ఆడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు ప్యాగ శ్యామలలక్ష్మణ్, ఉపసర్పంచు డేగ నగేష్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు కోలాటాలు, నృత్యాలతో సంతోషంగా ఆడుతూ వానదేవున్ని వేడుకున్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్



మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్

నెన్నెల, జులై 15 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన నెన్నెల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై సలహాలు, సూచనలిచ్చారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు వెంటనే పీహెచ్‌సీకి సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన పరీక్షలు చేయాలని, పరిసరాల పరిశుభ్రత గూర్చి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పోస్టులు, సిబ్బంది, ఔట్ పేషంట్లు, మందుల స్టాక్ వివరాల గూర్చి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సీహెచ్‌వో కె. వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ సుశీల, ఫార్మసిస్ట నారాయణ, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## దాడి హేయమైన చర్య

మందమర్రిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎంఎల్‌సీ తీన్మార్ మల్లన్న ఆఫీసుపై జరిగిన దాడి హేయమైన చర్య అని బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షుడు మూడా రపు శేఖర్‌లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన అనుచరులతో దాడి చేయించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రాంతి కుమార్, శివరామకృష్ణ, రమేష్‌రెడ్డి, ఐలయ్య, రవి, రమేష్ పాల్గొన్నారు.

## ఏపీవోకు సన్మానం

మందమర్రిరూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ ఏపీవో రజియా సుల్తానాకు ఇటీవల పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను అందజేయగా మంగళవారం కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి కడారి జీవన్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



## దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి 150 రోజుల పాటు నిర్వహించనున్న గ్రూప్-1, 2, 3,4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్లకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్, బీసీ స్టడీ సర్కిట్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 08732-22280లో సంప్రదించాలని సూచించారు.

## అందుబాటులో కంది, జొన్న విత్తనాలు

కెరమెరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) రైతులకు అందుబాటులో కంది, జొన్న విత్తనాలు రైతు వేదికలో అందుబాటులో ఉన్నాయని ఏవో యుగేందర్ అన్నారు. కేస్లాగూడ రైతు వేదికలో మంగళవారం ఆయన ఆయా గ్రామాల రైతులకు కంది, జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. నాలుగు కిలోల కంది బ్యాగ్ రూ.50, రెండు కిలోల జొన్న విత్తనాల బ్యాగ్ రూ.50 అని తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టా పాసుదారు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఆయా రైతు వేదికల్లో ఎంఈవోలను సంప్రదించాలని సూచించారు.

## అర్హులకు ఇళ్లు కేటాయించాలి

చింతలమానేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మంగళవారం బీఆర్ ఎస్ మండలాధ్యక్షుడు గోమాసి లాంచు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో నిరుపేదలను గుర్తించాలని కోరారు. అర్హులకు న్యాయం చేయాలని కోరారు., కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

# ఇందిరమ్మ ఇళ్లకు ధరల భారం

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు భారంగా మారింది. ముడి సరుకుల ధరలు అమాంతం పెరుగడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.**

- పెరిగిన స్టీలు, సిమెంట్, ఇసుక, కంకర ధరలు
- అడ్డా కూలీలకు డిమాండ్
- ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం రూ. 5 లక్షలు
- అదనంగా రూ. 4 లక్షల వరకు ఖర్చు
- ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల వినతి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెరిగిన స్టీలు, సిమెంట్, ఇసుక ధరలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులపై భారం పడుతోంది. ఇళ్ల నిర్మాణాలు గాడిన పడుతున్న తరుణంలో సామగ్రి రేట్లు అధికం కావడం ప్రతిబంధకంగా మారింది. వీటికి తోడు కంకర, కూలీ రేట్లు సైతం పెరిగిపోయాయి. పెరిగిన ధరలను బట్టి ఒక్కొక్క ఇంటిపై రూ. 3 నుంచి 4 లక్షల వరకు అదనపు భారం పడేలా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు.

### ● మొదటి విడతలో..

జిల్లాకు మొదటి విడతలో 1.669 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో సుమారు వేయి ఇళ్ల పనులకు ముగ్గు పోశారు. 300 ఇళ్లు పునాదుల దశను పూర్తి అయ్యాయి. ఇందులో 80 మంది లబ్ధిదారులకు రూ. లక్ష బిల్లు చెల్లించారు. ప్రభుత్వం విడతల వారీగా లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ దశలను పట్టి రూ. ఐదు లక్షల సహాయం అందజేస్తోంది. జిల్లాలోని 15 మండలాల్లో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులు కొనసాగుతున్నాయి. ఇందులో కొన్ని పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.

### ● ఐదు వందలకు పైగా..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 500 నుంచి 525 బస్తాలు అవసరముంటుంది. నెల రోజుల క్రితం బస్తా ధర రూ. 280 ఉండగా ప్రస్తుతం గ్రేడ్‌ను బట్టి ఒక్కో బస్తాపై రూ. 50 నుంచి రూ. 80 వరకు విక్రయిస్తున్నారు. పాత ధర ప్రకారం రూ. 1.47 సిమెంట్ ఖర్చు వచ్చేది. ప్రస్తుత రేటును బట్టి బస్తాకు అదనంగా రూ. 50 అదనంగా వేసుకున్న రూ. 1.73,250 అవుతుంది. ఈ లెక్కన ఒక్కో లబ్ధిదారుడిపై సిమెంట్ రూపేణా రూ. 26,250 వరకు అదనపు భారం పడుతుంది. బస్తాకు రూ. 80 అయితే రూ. 1,89 అవుతుంది. స్టీల్ ధర కంపెనీ బట్టి గతంలో క్వింటాలుకు కనిష్ఠంగా రూ. 5,500 ఉండగా ఇప్పుడు గరిష్ఠంగా రూ. 7,800కు చేరింది. ఇంటి నిర్మాణానికి కనీసం 1.5 టన్నుల సిమెంట్ పడుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. రూ. 5,500 చొప్పున స్టీలుకు రూ. 82,500 అవుతుండగా సగటున క్వింటులుకు రూ. 7500 రొప్పున రూ. 1,12,500 ఖర్చు అవుతుంది. ఈ లెక్కన రూ. 30 వేల వరకు అదనపు భారం పడుతుంది.

### ● అందని ఉచిత ఇసుక..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా సరఫరా చేయాల్సి ఉంది. కానీ ట్రాక్టర్ల యాజమానులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ట్రిప్పు ఇసుకకు రూ. 1.600 నుంచి రూ. 2 వేల వరకు తీసుకుంటూ సరఫరా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందు ట్రాక్టర్ ఇసుక ఏరియాను బట్టి రూ. వేయి నుంచి రూ. 1,200 వరకు సరఫరా చేసేవారు. ఇళ్ల నిర్మాణాల నేపథ్యంలో అదును చూసి ధరలు అమంతంగా పెంచేశారని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఇక కంకర విషయానికి వస్తే అదే పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఉపందుకుంటున్న నేపథ్యంలో అడ్డా కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇళ్ల నిర్మాణాలతో తాపీ మేస్త్రీ, కూలీలకు చేతి నిండా పని ఉండడంతో కొన్ని ప్రాంతాలలో మేస్త్రీలు దొరకక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మేస్త్రీకి రూ. 600 నుంచి 800 ఉండగా ప్రస్తుతం రూ. 800 నుంచి రూ. వేయి వరకు కూలీ చెల్లించాల్సి వస్తుంది. కూలీలకు రోజుకు రూ. 500 నుంచి 600 వర కు చెల్లించాల్సి వస్తున్నదని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మహిళల హక్కులను పరిరక్షించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, నిరోధానికి 2013లో ప్రభుత్వం చట్టం తీసుకు వచ్చిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటును చేసే మహిళల ఆత్మగౌరవం కాపాడే విధంగా చట్టాన్ని రూపొందించిందని చెప్పారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బందితో జిల్లాలో కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. షీ బాక్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో అన్ని సంస్థల వారు కమిటీ సభ్యులను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అన్ని సంస్థల వారు సహకరించాలని కోరారు. ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీ భాస్కర్

వాంకిడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం జైత్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు పిల్లలకు పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంగళవారం డీడీ భాస్కర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సరఫరా చేసిన గుడ్లను, ఇతర పౌష్టికాహార సరుకులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసిన గుడ్లు, కుళ్లిన వాసన వస్తున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అన్ని కేంద్రాల్లో నాణ్యమైన గుడ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

## నాణ్యమైన గుడ్లు పంపిణీ చేయాలి

జైనూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు పంపిణీ చేయాలని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకమైన గుడ్లను సరఫరా చేస్తుండడంతో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం 50 గ్రాముల ఉండాల్సిన గుడ్లు 40 నుంచి 45 గ్రాములు ఉంటున్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తుమ్రం కృష్ణ, మేస్రాం లక్ష్మణ్ పటేల్, ఆత్రం కిషన్‌రావ్, కొడప జగన్నాథ్‌రావ్, మేస్రాం ధర్ము పాల్గొన్నారు.

## 18న తుడుం దెబ్బ మండల కమిటీ ఎన్నికలు



మాట్లాడుతున్న తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు మాధవ్‌రావు

సిర్పూర్(యు), జూలై 15 (ఆంధ్రజ్యోతి):తుడుం దెబ్బ మండల కమిటీ ఎన్నికలు ఈ నెల 18న నిర్వహించనున్నామని తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పెందోర్ మాధవ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావే శంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, తుడుం దెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు పెందోర్ శంకర్, మాజీ సర్పంచ్ పెందోర్ నాగోరావు, నాయకులు సిడం సుబాష్, శంభు పాల్గొన్నారు.

## ఎకరానికి రూ.60 లక్షల పరిహారం చెల్లించాలి

రెబ్బెన, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ కాస్టులో భూములు కోల్పోతున్న వారికి ఎకరానికి రూ.60లక్షల పరిహారం చెల్లించాలని మంగళవారం రవాణా హైవేల శాఖ సహాయ మంత్రి మల్హోత్రకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్, బీజేపీ వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, సోనాపూర్ గ్రామ పటేల్ దొందెరావు, సొల్లు లక్ష్మి పాల్గొన్నారు.

## రోడ్డు పనులు ప్రారంభం

సిర్పూర్(టి), జూలై 15 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ఆర్అండ్‌బీ అధికారులు బీటీ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభించారు. బస్టాండు నుంచి రైల్వే స్టేషన్ వరకు రడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో వాహదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన అధికారులు రోడ్డు పనులు ప్రారంభించారు.

## గద్దెను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామంలో దండోర గద్దెను కూల్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్‌కు వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుంగాపూర్ గ్రామంలో జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జెండా గద్దెను నిర్మించుకుంటే కూల్చి వేశారని అన్నారు. కూల్చివేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో కేశవరావు, ప్రభాకర్, అశక్, వెంకటేశం, లక్ష్మణ్, రవి, మమత, సత్యవతి, లలిత తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

వాంకిడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింబుగూడ గ్రామంలో నిర్మించిన బహుళార్థక ప్రయోజన కేంద్రాన్ని బుధవారం కేంద్ర సహాయ మంత్రి హర్షమల్హోత్ర ప్రారంభించేందుకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. లింబుగూడ గ్రామానికి వెళ్లే దారులను, పరిసర ప్రాంతాలను సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, పీఎంవో ఖాజా అజీజుద్దీన్‌తో కలిసి మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటేందుకు గుంతలు తవ్వారు. చెత్తాచెదారం తొలగించారు.

## ఎస్ఎఫ్ఐ మండల కార్యవర్గం

దహెగాం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అం జలి, కార్యదర్శిగా ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా కిరణ్, అంజలి, అంజన్న, సహ కార్యదర్శులుగా పుష్పాంజలి, మీనా, కార్తీక్, సభ్యులుగా సిద్దార్థ్, అక్షిత్, బాలేష్, రఘువరన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ కార్యవర్గం

రెబ్బెన, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఆటో యూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా నర్సింగరావు, ఉపాధ్యక్షుడిగా రాజాగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని బొడ్డురమేష్, రాజేష్, రాపర్తి ఆశోక్, వెంకటేశ్వర్‌గౌడ్, భుజంగరావు, అదే హన్మంతు తదితరులు సన్మానించారు.

# ప్రజా సమస్యలపై పట్టింపు కరువు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని పాలకులకు ప్రజల సమస్యలపై పట్టింపు కరువైందని బీఆ ర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తుంగమడుగు గ్రామం సమీపంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి బూతులు మాట్లాడడం కాకుండా ప్రజల బాధలు చూడాలన్నారు. కాగజ్‌నగర్‌కు ఆనుకొని ఉన్న తుంగమడుగు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదన్నారు. ఈ గ్రామంలో మహిళలు, గర్భిణులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డు బాగా లేక పోవడంతో అంబులెన్స్ రాని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి గ్రామీణుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు సమస్యను పట్టించుకోని అధికారులు

బెజ్జూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని కుశ్నపల్లి గ్రామం నుంచి సోమిని వరకు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సోమిని గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు గ్రామాల గిరిజన నాయకులు మాట్లాడారు. వర్షాకాలంలో రోడ్డు సౌకర్యం లేక పోవడంతో అత్యవసర సమయాల్లో అవస్థలు పడుతున్నామని చెప్పారు. ఈ విషయమై పలు మార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేక పోవడంతో కనీసం వైద్య సదుపాయాలు కూడా వర్షాకాలంలో అందడం లేదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దృష్టికి తీసుకు పోవడంతో రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని చెప్పారన్నారు. ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారన్న నమ్మకం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయి, శ్రీనివాస్, చంద్రశేఖర్, అనీల్, సత్తయ్య, శంకర్, ఇస్తారి, రాజు, అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈవో హనుమంతు

## పాఠశాలను సదర్శించి.. బోధనను పరిశీలించి..

కౌటాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబార, కనికి, భీవర్‌హెటట్టి పాఠశా లలను మంగళవారం ఎంఈవో హనుమంతు సందర్శించి బోధన తీరును పరిశీలించారు. బేస్ లైన్ పేపర్లకు సంబందించిన రికార్డులను పరిశీలించి భద్రంగా ఉంచాలన్నారు. సామర్థ్యాల వారీగా విశ్లేషించుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. భీవర్‌హెట్టి పాఠశాలలో కృత్యాదార బోధన చేస్తున్న సాయికుమార్‌ను అభినందించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని, తప్పని సరిగా టెస్ట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, బోజనానికి ముందు విద్యార్థులచే చేతులు శుభ్రం చేయించాలని, చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి రోజు గ్రంథాలయ పుస్తకాలను చదివించాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల పఠన సామార్థ్యాన్ని పరిశీలించారు.

## ● సంక్షిప్తం..

**కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి):** కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్మీ శివకుమార్ శ్రీదేవి, చిప్పమౌనిక, లక్ష్మణ్, సంతోష్ ఠాకూర్, వెంకటేష్, ప్రశాంత్, ప్రయాగ్ తదితరులు పాల్గొన్నారు.

**పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి):** మండలంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధుకర్, సత్యనారాయణ, భాస్కర్, నాగన్న, ప్రభాకర్, రాజన్న, వెంకన్న, కాంతారావు, శ్రీనివాస్, ప్రభాకర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి):** మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంఈవో వేణుగోపాల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై కమలాకర్‌లతో పాటు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులతో కలిక మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని కోదండరామాలయంలో వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలను నిర్వహించారు. కార్యక్ర మంలో ఆర్య వైశ్య మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి):** కాగజ్‌నగర్ ప్రధాన రోడ్డుతో పాటు వార్డు నంబరు 22లో ఏర్పడిన గుంతలను పట్టణానికి చెందిన దివంగత మాజీ కౌన్సిలర్ జాని మీయా కుమారుడు హబీబ్ తన సొంత ఖర్చు డబ్బులతో పూడ్చేందుకు మంగళవారం శ్రీకారం చుట్టారు. గుంతలు పూడ్చివేసేందుకు సుమారు 20 వేల రూపాయలు వెచ్చించామని హబీబ్ తెలిపారు.

**రెబ్బెన, (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎన్నికైన రెబ్బెన గ్రామానికి చెందిన శశికిరణ్‌పటేల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర మున్నూరు కాపు నూతన కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షుడిగా కొండ దేవయ్య పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెన్న సోమశేఖర్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి):** మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రవీణ్‌బాబు మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ప్రహరీ క్లబ్‌లను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి):** ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ వాసవి హైస్కూ ల్‌లో బోనాల సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. విద్యార్థులు శివసత్తులు, పోతురాజుల వేషదారణలో అలరించారు. కార్యక్రమంలో యాజమాన్య బృందం మహేశ్వర్‌రావు, ప్రసాద్, సురేష్, రాజ్‌కుమార్, అజయ్, క్రాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సర్వే నిర్వహించి ఆదుకోవాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పెంచికలపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాణహిత నది, పెద్దవాగు వరదలతో 400 ఎకరాలకు పైగా పంటలు నీట మునిగి నష్ట పోయామని అధికారులు సర్వే నిర్వహించి ఆదుకోవాలని వ్యవసాయాధికారి మనీషకు మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ముంపు ప్రాంత రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏటా వరద ఉధృతికి మురళీగూడ, కమ్మర్‌గాం గ్రామాల రైతులు నష్ట పోతున్నా రన్నారు. కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవా సమితి, రాయిసెంటర్ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు సకారాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం పీఆర్సీ అమలు చేయాలి

తిర్యాణి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీఎస్‌పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 317 జీవోతో స్థానికత కోల్పోయిన వారికి స్థానిక జిల్లాలకు పంపాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పెండింగ్ డీఏలు త్వరగా ఇవ్వాలని తదిర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వేంకటేశ్వరరావు, సాంబశివ రావు, అమరందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న మండలాధ్యక్షుడు శ్రీనివాస్